# సీతా కళ్యాణం

సీత కల్యాణంకీ, మైకేల్ కాల్డ్‌వెల్‌కీ వివాహం చేయటానికి పెద్దలు సుముహూర్తం నిర్ణయించారు కనుక మీరందరూ సకుటుంబ సపరివార సమేతంగావిచ్చేసి అక్షింతలు వేసి, వధూవరులని ఆశీర్వదించి, మదర్పిత చందనతాంబూలాది సత్కారాలని అందుకోవలసిందిగా కోరుతున్నామని మా ఆస్టిన్‌లో శ్రీనివాస్ కల్యాణం అండ్ పద్మావతి కల్యాణం వివాహపత్రిక పంపించారు. వివాహపత్రికల నమూనా తయారు చేయటంలోనూ, ప్రింట్ చేయటంలోనూ నేను సహాయం చేశాను కనుక, నాకు అవన్నీ తెలిసిన విశేషాలే.

సీత పసిపిల్లగా వున్నప్పటినించీ నాకు బాగా తెలుసు. మంచి పిల్ల. ఆమెకు తన భవిష్యత్తు గురించీ, తన జీవితం గురించీ నిర్దుష్టమైన అభిప్రాయాలు వుండటమే కాక, తన భావాలని ఎదుటివారికి సూటిగా నొప్పించకుండా చెప్పగలిగిన ధైర్యం, నేర్పు కూడా వున్నాయి. తనతోపాటే యూనివర్సిటీలో చదువుతున్నమైకేల్ అంటే

ఎంతో ఇష్టపడింది. వీళ్ళిద్దరూ ఒకళ్ళనొకళ్ళు విడిచివుండలేమని నిర్ణయించుకున్న తర్వాత పెద్దలతో చెప్పటం, వాళ్ళు అసమ్మతి తెలపటం, వీళ్ళు గట్టిగా మొండికేయటం, చివరికి పెద్దవాళ్ళు అంగీకరించటం, వెంటనే పెళ్ళి పనులు పూర్తిచేసి, పత్రికలు పంపించేయటం చకచకా జరిగిపోయాయి.

శ్రీనివాస్‌కి చిరకాల మిత్రుడిగా, ప్రాణ స్నేహితుడిగా నేనూ పెళ్ళి పెద్దల్లో ఒకడిని. ఆ రోజు ప్రొద్దున్నే డబుల్ ట్రీ హోటల్లో వివాహం.

మా ఉళ్ళో ఆ పెళ్ళిసందడి నాలుగు రోజులు ముందుగానే మొదలయింది. మా శ్రీనివాసుడి కూతురు. అందులోనూ సీత. దేవుడి పెళ్ళికి అందరూ పెద్దలేనని, అందరూ పెద్దలయిపోయారు. శ్యామల సరోజ రత్న ప్రొద్దున్న మధ్యాహ్నం సాయంత్రం రాత్రి కార్యక్రమాల్లో ఏ చీరలు కట్టుకోవాలో, ఏ డ్రెస్సులు వేసుకోవాలో, ఏ నగలు పెట్టుకోవాలో తర్జన భర్జనలు పడి, ఇక పడలేక, చివరికి పెళ్ళి రోజు వచ్చేసరికి, ఏవి దగ్గరలో వుంటే అవి కట్టేసుకుని, సిద్ధమయిపోయారు.

పెళ్ళంటే ఆడవాళ్ళు ఏం కట్టుకోవాలో, ఏం పెట్టుకోవాలో నిర్ణయించుకోలేక ఎందుకిలా తలకిందులయిపోతారని ఆలోచిస్తూ శ్యామలని అడిగాను, అమెరికన్ సూటు వేసుకోనా... మత్ పైజమ్మా లాల్చీ వేసుకోనా అని.

"ప్రొద్దున్నే పైజమా లాల్చీ..... సాయంత్రం సూటు.. " ఆ మాత్రం తెలీదూ అన్నట్టుగా అంది.

"పొద్దున తెల్లదా.. క్రీమ్ కలర్‌దా... సాయంత్రం నీలందా... నల్లదా... "

"తెల్లదే... స్వచ్ఛంగా బాగుంటుంది. నీలందే.... శుభకార్యానికి నలుపేమిటి? మీ ముఖం" అని, "నేనేం కట్టుకోను? ఎర్ర బార్డర్ వున్న నల్ల చీరా, నల్ల బార్డర్ వున్న నీలం చీరా... " అంది ఎటూ తేల్చుకోలేక.

"ఎర్రబార్డర్ వున్న నీలం చీర కట్టుకో..... శుభకార్యానికి నలుపేమిటి? నా ముఖం" అని బయటికి నడిచాను.

మైకేల్ అమ్మకీ చెల్లెలికీ పట్టుచీరలు కట్టి, బొట్టు పెట్టి, చేతులకి గోరింటాకు పెట్టి, వాళ్ళని పూర్తిగా ఇండియనైజ్ చేసేశారు శ్యామలా, రత్నా.

మైకేల్‌కి నేనే పంచకట్టి, లాల్చీ వేశాను. ఆ డ్రెస్‌లో చాల అందంగా, మా సీతకి తగ్గ శ్రీరామచంద్రుడిలా వున్నాడు.

మన పద్ధతిలోనే నేల మీద పీటలు వేసి, అగ్నిహోత్రం పెట్టి, పెళ్ళి తతంగం మొదలుపెట్టాడు పురోహితుడు.

పురోహితుడు సంస్కృతంలో చెప్పమన్న మాటల్ని జాగ్రత్తగా మళ్ళీ అడిగి సరిగ్గా చెప్పటం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు మైకేల్.

కార్యక్రమం అవుతున్నప్పుడు పురోహితుడు మధ్యమధ్యలో మంత్రాలు చెప్పటం అవుతున్నాడు. కృష్ణమూర్తి కార్యక్రమ విశేషాలు ఇంగ్లీష్‌లో క్లుప్తంగా చెబుతున్నాడు.

"నౌ ది బ్రైడ్‌గ్రూమ్ ఈజ్ ప్రామిసింగ్ ఆన్ ది ఫైర్, దట్ హి విల్ నాట్ లీవ్

హిస్ వైఫ్, ఈవెన్ ఇఫ్ దేరార్ ఫైనాన్షియల్ ప్రాబ్లెమ్స్. . " అర్థేచ, ధర్మేచ, మోక్షేచ, కామేచ, నాతి చరామి అన్న పదాలను అనువాదం చేస్తూ.

అలాగే సప్తపది. ఆ ఏడడుగుల బంధానికీ అర్థం వివరంగా చెబుతున్నాడు కృష్ణమూర్తి.

ఆ మంత్రాలకి అర్థం తెలియని అమెరికన్లు, అర్థం తెలియని ఇండియన్లు, అర్థం తెలిసిన ఇండియన్లు అందరూ శ్రద్ధగా వింటున్నారు. అలాగే మంగళ సూత్రం సుముహూర్తం. తలంబ్రాలు పోసుకోవటం చాల సరదాగా గడిచింది.

శ్రీనివాస్ కళ్ళల్లో తృప్తి. పద్మావతి ముఖంలో కొండంత సంతోషం. సభ్యత కోసం కళ్ళల్లోనే ఆగిపోయిన ఆనంద భాష్పాలు.

మధ్యాహ్నం పన్నెండు గంటలకి తెలుగు భోజనం. కారాలూ మిరియాలు ఎక్కువగా నూరకుండా చేశారేమో అందరికీ బాగానే వుంది విందు భోజనం.

భోజనానంతరం నేనూ శ్యామలా, ఇంటికి వెళ్ళి గబగబా తయారయి, నాలుగు గంటలకల్లా మెథడిస్ట్ చర్చికి వచ్చాం. మేమక్కడికి వెళ్ళేసరికే ఒక్కొక్క ళ్ళూ మెల్లగా వస్తున్నారు. సరిగ్గా ఐదు గంటలకి కార్యక్రమం మొదలయింది.

పియానో మీద సంగీతం వినిపిస్తుండగా, మా శ్రీనివాసుడు కూతురు చేయి పట్టుకుని, నెమ్మదిగా అక్కడికి తీసుకువచ్చాడు. అందరం లేచి నుంచున్నాం. తెల్లటి పెళ్ళి గౌనులో విచ్చుకోబోతున్న మల్లెమొగ్గలా వుంది సీత. సీత వెనకనే గులాబీరంగు దుస్తుల్లో ఆమె స్నేహితురాళ్ళు విరిసిన గులాబీ పువ్వుల్లా మెరిసిపోతున్నారు. మైకేల్, ఇంగ్లీష్ పురోహితుడూ నుంచున్న చోట సీతని వదిలి పద్మావతి పక్కనే కూర్చున్నాడు శ్రీనివాసుడు.

పెళ్ళినాటి ప్రమాణాలు చేసుకున్నాక, ఉంగరాలు తొడిగాక, వాళ్ళిద్దర్నీ భార్యాభర్తలుగా పరిచయం చేశాడు అమెరికా పురోహితుడు.

సీతని పెదవుల మీద ముద్దు పెట్టుకున్నాడు మైకేల్.

అందరూ చప్పట్లు కొట్టారు.

సీత, మైకేల్‌తో బయటికి వెడుతున్నప్పుడు, పూలగుచ్ఛాన్ని వెనక్కి విసిరేసింది. అది ఎవరికి దొరికితే వాళ్ళకి వెంటనే పెళ్ళి అవుతుందని అదో నమ్మకం.

ఆ రోజు రాత్రి ... రిసెప్షన్.

రిసెప్షన్‌లో భోజనాలు అయాక సీత, మైకేల్ డాన్స్ చేశారు.

తర్వాత మైకేల్, వాళ్ళ అమ్మతోనూ, పద్మావతితోనూ డాన్స్ చేశాడు.

డాన్స్ చేస్తున్నప్పుడు పద్మావతితో అన్నాడు మైకేల్, "మీ అమ్మాయిని చాల జాగ్రత్తగా చూసుకుంటాను" అని.

అతన్ని ప్రేమగా చూసింది పద్మావతి.

శ్రీనివాస్‌తో డాన్స్ చేస్తున్నప్పుడు, అతని కళ్ళల్లోకి చూస్తూ "థాంక్యూ నాన్నా .. ఫరెవ్వెరి థింగ్... " అన్నది సీత.

శ్రీనివాస్ ఆప్యాయంగా సీత నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాడు.

* * *